క్లుప్తంగా

నాగాపురంలో పారిశుధ్య పనులు

గొలుగొండ: సీహెచ్ నాగాపురంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. వీధి కాలువల్లో పూడిక తీశారు. తాగునీటి పథకాల వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాలు తొలగించారు. గ్రామ వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని సర్పంచ్ కోరారు.

పాల సంఘం అధ్యక్షుల ఎన్నిక



అధ్యక్షులను అభినందిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని నాల్గు గ్రామాల్లో విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులను ఆయా గ్రామాల డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల పాల కేంద్రాల వద్ద శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. పి. భీమవరంలో వలివిరెడ్డి రాజబాబు, ఐయితంపూడిలో అప్పాన తాతబాబు, సీతయ్యపేటలో నందవరపు రాజబాబు, గొర్లెపాలెంలో శొంఠ్యాన శ్రీను అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరిని ఆయా గ్రామాల రైతు సంఘం నాయకులు అభినందించారు.

ఆకుమడులకు మేలు చేసిన వర్షం



బంగారుమెట్ట పొలాల్లో వర్షంతో తడిచిన ఆకుమడి

బుచ్చెయ్యపేట: మండలంలో కురిసిన వర్షం వరి ఆకుమడులకు మేలు చేసింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం వల్ల రైతులు వేసిన ఆకుమడులకు నీరందింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంతో పది రోజులుగా గంటికొర్లాం, కొమ్మళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పీడీ పాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్బీపురం, తదితర గ్రామాల్లో రైతులు జోరుగా వరి ఆకుపోతలు వేశారు. వేసిన వరి విత్తనాలకు పదును అందక విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే ఉండిపోయాయి. కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో ఆకుమడుల్లో నీరు చేరింది. వరి ఆకు మొలకెత్తడానికి సరిపడ్డ పదును ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవకపోతే బిందెలతో నీళ్లు మోసి ఆకుమడులు తడపాల్సి వచ్చేదని వాపోయారు.

పెద్దేరును సందర్శించిన ఎమ్మెల్యే బండారు



పెద్దేరు జలాశయం నిర్వహణపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శుక్రవారం సందర్శించారు. జలాశయం నిర్వహణపై ఆరా తీశారు. లీకేజీల వివరాలు, గేట్లు పటిష్టత, విద్యుత్ సమస్యలు, సాగు నీరుపై జలాశయం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకులు ఉండూరు దేముడు, అద్దేపల్లి జగ్గారావు, నందారపు సన్యాసిరావు, జలాశయం డీఈ చిన్నంనాయుడు, డీఈ వేణుగోపాలరావు, మైనర్ రిజర్వాయర్ డీఈ బాల సూర్యం, జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవం

అనకాపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామ స్థాయి నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు తెలిపారు. స్థానిక భీమునిగుమ్మంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు చేసే సమయంలో తెల్లచొక్కా, నల్లప్యాంట్, మెడ లో నల్లకండువా వేసుకుని రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్నఅప్పారావు, వర్కింగ్ అధ్యక్షుడు కటుమూరు మంగరాజు, ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశరావు, జిల్లా నాయకులు నీటిపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

పశు సంక్రమణ వ్యాధులతో జాగ్రత్త



పశుసంవర్ధకశాఖ అధికారి రాంబాబు

మాకవరపాలెం: పశువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచపల్లి పశువైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. జునోసిస్ డే సందర్భంగా శుక్రవారం జి.కోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల ద్వారా సోకే రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదమన్నారు. కుక్క కరిస్తే తప్పకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. పశువుల నుంచి సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలను తెలియజేశారు. జునోసిస్ డే నేపథ్యంలో శనివారం మండలంలోని అన్ని పశువైద్య కేంద్రాల్లోనూ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. హెచ్ఎం నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

నర్సీపట్నం: జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పశువుల ఆస్పత్రిలో ఈ నెల 6న పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. అనేక రకాల వైరస్‌లు ప్రపంచాన్ని వణికిస్తున్నాయన్నారు. ఈ వైరస్‌లు జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందుతున్నట్లు పరిశోధకులు నిర్ధారించారన్నారన్నారు. జూనోటిక్ వ్యాధులు చాలా రకాలుగా గుర్తించినప్పటికీ ఎక్కువ వ్యాధుల పట్ల భయపడాల్సిన అవసరం లేదన్నారు. పెంపుడు జంతువులను శాస్త్రీయ పద్ధతుల్లో పోషించడం ద్వారా జూనోటిక్ వ్యాధులను నివారించవచ్చన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

రోలుగుంట: ప్రపంచ జూనోసిస్ డే ను శనివారం స్థానిక పశు వైద్యశాల వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పశువైద్యాధికారి నూకేశ్వర్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు. ప్రాణాంతకమైన రేబిస్ మొదలగు వ్యాధులు మనుషులకు సంక్రమించకుండా ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషి చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

చర్మవ్యాధులపై జాగ్రత్తలు

మాడుగుల: పశు సంక్రమణ వ్యాధులతోపాటు చర్మవ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి అరుణా కిరణ్ తెలిపారు. స్థానిక కింతలి హైస్కూల్‌లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జంతుసంబంధిత వ్యాధులు ప్రబలకుండా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా ఇప్పించాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎలుకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు మణిలక్ష్మణ్, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశువైద్యాధికారి అరుణా కిరణ్, తదితరులు

డెంగ్యూ బారిన పడకుండా జాగ్రత్తలు



ఆర్.వై.అగ్రహారంలో విద్యార్థులకు కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు



ఆర్.వై.అగ్రహారంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

కె.కోటపాడు: డెంగ్యూ బారిన పడకుండా వైద్య సిబ్బంది వివరించే కనీస జాగ్రత్తలను ప్రజలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్.వై.అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగ్యూ వస్తుందన్నారు. డెంగ్యూ వచ్చిన వారికి అధిక ఉష్ణోగ్రతతో జ్వరం, కీళ్లు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలు ఉంటాయన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా నిల్వ నీరు లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ, ఏఎన్ఎం వై.రాము, మహిళా పోలీస్ భవాని పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలి

బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రజలంతా సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు కోరారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం బోయిలకింతాడలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అందిస్తున్న సేవలను గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులంతా పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ బొబ్బిలి అప్పలనర్సమ్మ, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ బూరె బాబూరావు

122 ఆవులకు లంపీస్కిన్ నివారణ టీకాలు

కె.కోటపాడు: లంపీస్కిన్ బారిన పడకుండా ఉండేందుకు పశువైద్య కేంద్రాల ద్వారా పశువులకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. శుక్రవారం కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో 122 ఆవులకు లంపీస్కిన్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఆవులకు లంపీస్కిన్ వైరస్ సోకే పరిస్థితి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడిన పశువుల శరీరంపై బుడిపెలతో కూడిన పుండ్లు ఏర్పడడంతో కాళ్ల వాపు, ఆహారం సమంగా తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలతో పశువు నీరసించి, మరణించే పరిస్థితికి చేరుకుంటుందని పేర్కొన్నారు. లంపీస్కిన్ నుంచి రక్షించేందుకు పశువులకు జూలై, ఆగస్టులో ఉచితంగా వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా ఆవులకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. శనివారం పశు వైద్య కేంద్రాలతో పాటు రైతు సేవా కేంద్రాల్లో జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేయనున్నట్లు తెలిపారు.



లంపీస్కిన్ టీకాలను ఆవులకు వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

రోలుగుంట: మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులు స్వల్పకాలిక రకాలైన మినప, పెసర, బొబ్బర తదితర అపరాల పంటలను విస్తారంగా సాగు చేపట్టారు. కొమరవోలు, రోలుగుంట, కొండపాలెం, శరభవరం, వడ్డిప, జె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో పండిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పూత, మరికొన్ని గ్రామాల్లో పిందె దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పచ్చపురుగు తెగులు ఆశించి ఆకుల చుట్టూ రంధ్రాలు ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. అపరాల పంట వేసిన నెలలోనే తెగులు ఆశిస్తుందన్నారు. ఆకుపచ్చ పురుగు ఆకుల పత్రహరితాన్ని గోకి తిని ఆకులకు రంధ్రాలు పెడుతుందన్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గిపోతాయన్నారు. పచ్చపురుగు నివారణకు గాను క్లోరోఫైరిపోస్ 2.5 ఎం.ఎల్‌ను లీటరు నీటిలో లేదా ఎస్ఫేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో మిశ్రమం చేసి పిచికారీ చేసుకుని పంటలను సంరక్షించుకోవాలన్నారు.



తెగులు పట్టిన మినప పంటలో పిచికారీ చేస్తున్న రైతు

వానరాలతో హడలిపోతున్న ప్రజలు



నివాసాల మధ్య సంచరిస్తున్న వానరాలు

మాకవరపాలెం: వానరాల సంచారంతో ప్రజలు హడలిపోతున్నారు. స్థానిక కిందివీధి, రాజారావుపేట ప్రాంతాల్లో చాలా రోజులుగా వానర దండు సంచరిస్తోంది. అధిక సంఖ్యలో తిరిగే వానరాలు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని, ఆ సమయంలో అడ్డుకుంటే తిరగబడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వానరాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేసి బంధించే వారన్నారు. ప్రస్తుతం అధికారులు బోన్లు ఏర్పాటు చేసి వానరాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మోదమాంబ ఆలయానికి ఢమరుకం వితరణ



ఆలయ ప్రధాన అర్చకులకు ఢమరుకం అందజేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయానికి దాతల సహకారంతో వాయిద్యనాదం(ఢమరుకం)ను శుక్రవారం వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన కలిమి వెంకటరమణ కుమారుడు సంతోష్, వరలక్ష్మి దంపతులు, మజ్జి సముద్రం కుమారుడు జగన్నాథరావు(ఆర్మీ) అనురాధ దంపతులతోపాటు గోకాడ కొండలరావు, కృష్ణవేణి దంపతుల ఆర్థిక సాయంతో దీన్ని కొనుగోలు చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. పడాల అప్పలనర్సయ్య, నత్తల వరహామూర్తి, కలిమి గోపాల్, పోతిన జగదీష్ పాల్గొన్నారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు సత్కారం రేపు

అనకాపల్లి: ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహకాలతో ఆదివారం సత్కరించనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారి శ్రీ సత్యలక్ష్మీగ్రాండ్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు నూతన భవనం కోసం ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సమస్యల్ని గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైల్లో ప్రయాణించే సమయంలో చార్జీల్లో రాయితీలు కల్పించాలన్నారు. 60 ఏళ్లు దాటిని వృద్ధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు శరగడం నూకరాజు, విజయలక్ష్మి, విల్లూరి రాము, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అనకాపల్లి: నిత్యం ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ధ్యాన ఆశ్రమం శ్రీ గీజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక ప్రతినిధి నరేంద్ర ముదల్కర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో మనుషుల జీవనశైలిలో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. కోవిడ్ తరువాత ప్రతి వ్యక్తి వ్యాయామం, ధ్యానం, యోగాపై ఆసక్తి పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఒత్తిడితో శరీరం పలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న నరేంద్ర ముదల్కర్

బడిలోనే బడిఈడు పిల్లలు



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో ఉషారాణి, హెచ్ఎం స్వర్ణలత

బడికి పోతా ర్యాలీలో ఎంఈవో ఉషారాణి

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి–2 వి. ఉషారాణి తెలిపారు. ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వై. స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం బడికి పోతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి గ్రామ సచివాలయం వరకు ర్యాలీగా చేరుకొని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. పదో తరగతి విద్యార్థులంతా ఇప్పటి నుంచి ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించి తద్వారా ట్రిపుల్ ఐటీ సీట్లను సాధించాలని ఎంఈవో సూచించారు. అనంతరం ఖోఖో, కబడ్డీ క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంఈవో ఉషారాణి, హెచ్ఎం స్వర్ణలత

నాతవరం: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని ఎంఈవో –2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో శుక్రవారం బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వాటిని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలన్నారు. ఇంతవరకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, ఇతర మెటీరియల్ పాఠశాలలకు పంపించి విద్యార్థులకు అందించామన్నారు. విద్యతోపాటు వారి ఆరోగ్యం ముఖ్యమని, దానిపై దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశమున్నందున ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు లాలం రవి, సీహెచ్. సురేష్, సీఆర్పీ అరుణజ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వెన్నలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో –2 కామిరెడ్డి వరహాలబాబు

నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. వివిధ రకాల అసంఘటిత రంగ కార్మికులతో శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు మేలు చేసే విధంగా 40 కార్మిక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. యాజమాన్యాలపై కార్మికులు పోరాటం చేసే హక్కును కోల్పోతారన్నారు. నూతన రవాణా చట్టాలను మార్చేశారన్నారు. ఈ నెల 10న తలపెట్టిన ధరాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజు, కార్మికులు

అతిసారపై విద్యార్థులకు అవగాహన

నర్సీపట్నం: తగిన జాగ్రత్తలు పాటించకపోతే పిల్లలు ఎక్కువగా అతిసార బారిన పడతారని బలిఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వెనుష మాధుర్య పేర్కొన్నారు. ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం అతిసారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలుషిత ఆహారం తీసుకోవటం ద్వారా వ్యాపిస్తుందన్నారు. చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోవడంతో వ్యాధి బారిన పడకుండా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్ నిర్వహించారు. రక్త తక్కువగా ఉన్న విద్యార్థులకు సరైన సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, పాఠశాల స్టాఫ్ నర్సు లక్ష్మీప్రసన్న, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల మన్ననలు పొందే విధంగా సేవలు

నాతవరం: ప్రజల మన్ననలు పొందే విధంగా ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తిస్తే, సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం లభిస్తుందని ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో పని చేస్తున్న గ్రంథాలయాధికారి ఆర్.కన్నబాబు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాతవరం గ్రంథాలయానికి కన్నబాబు వన్నె తెచ్చారన్నారు. వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు ప్రజాప్రతినిధులకు అధికారులకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచేవారన్నారు. అనేక విజ్ఞాన, సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వీటి నిర్వహణకు సొంత నిధులు వెచ్చించారని ప్రశంసించారు. గ్రంథాలయంలో చదువుకుని అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి కన్నబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పైల పోతురాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు, విశ్రాంత గ్రంథాలయాధికారి మురళి, ఉపాధ్యాయులు, వివిధ మండలాలకు చెందిన గ్రంథపాలకులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



కన్నబాబు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్

అనకాపల్లి: అనకాపల్లి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సరిపల్లి రాజేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా దేవత అనిల్, కోశాధికారిగా గ్రంధి సత్యేంద్రతో పాటు మరో 31 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో క్లబ్ సీనియర్ నాయకుడు, విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గరుడ బుచ్చిరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.